సాక్షి వనపర్తి

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



పాలన అస్తవ్యస్తం

జోగులాంబ ఆలయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడి పాలన గాడి తప్పుతోంది.

వివరాలు 8లో ▸



మద్యం పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న తనిఖీల్లో భారీగా మద్యం పట్టుబడుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 42.9 /28.0

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత తప్పదు. అప్పుడప్పుడు వడగాలులు వీచే అవకాశం ఉంది.

పాలమూరు గడ్డ.. నా అడ్డా..



మహబూబ్‌నగర్ రోడ్‌షోలో కాంగ్రెస్ శ్రేణులు



కార్యకర్తలకు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి.. చిత్రంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్

అభివృద్ధి చేసే బాధ్యత నాది..

- 2 పార్లమెంట్ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి..
- బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లు చేసిందేమీ లేదు..
- పదేళ్లు అధికారంలో ఉండి ఎడారిగా మార్చిండు
- 100 రోజుల్లోనే జిల్లాకు రూ.వేల కోట్లు తెచ్చాం
- కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మహబూబ్‌నగర్ అభ్యర్థిగా 'చల్లా' నామినేషన్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'ఇక్కడే పుట్టిన, ఇక్కడే పెరిగినా. రేపు పోయినా ఈ మట్టిలో కలిసి పోయే బిడ్డనే. నల్లమల అడవుల బిడ్డగా ఈ నేల, ఈ గాలి, ఈ నీరు నాది.. ఈ గడ్డ, ఈ అడ్డా నాది, మనది, మనందరిది. నాకున్న బాధ, నాకున్న దుఃఖం ఎవరికైనా ఉంటదా? ఈ జిల్లా పట్ల మీరొక్కసారి ఆలోచన చేయండి. ఎంతెత్తుకెదిగినా.. ఢిల్లీకి రాజైనా గల్లీకి బిడ్డ అన్నట్లే నేను పాలమూరు బిడ్డను. పాలమూరును అభివృద్ధి చేసే బాధ్యత నాది.' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నుంచి మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మెట్టుగడ్డ నుంచి క్లాక్‌టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్ మాట్లాడారు. పదేళ్లు కేసీఆర్, మోదీ అధికారంలో ఉన్నా ఏమీ చేయలేదు. పాలమూరును ఎడారిగా మార్చారు. వందరోజులు కాలేదు మన ప్రభుత్వమొచ్చి, ప్రజాపాలనొచ్చి.. ఏమీ చేయలేదు కాబట్టి ఓడించాలని అంటున్నారు. ఇది న్యాయమా? పిలగాడు నడవాలన్నా ఏడాది అయితది.. మన ప్రభుత్వమొచ్చి మూణెల్లు కాలేదు. ఆర్నెల్లు అయితేనే అన్న ప్రాసన చేస్తారు. మన ప్రభుత్వానికి అప్పుడే శాపనార్థాలు పెడుతున్నారు. కేసీఆర్ అయితే పిట్టల దొరకు తాతయ్యాలా తయారయ్యారని విమర్శించారు. రేవంత్ ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

ఈ ప్రభుత్వం ఆడబిడ్డలది..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వందరోజులు కాలే. ఆడబిడ్డలకు ఉచితంగా బస్సు ప్రయాణం ఇచ్చినం. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాం. మహిళలకు కట్టెల పొయ్యి నుంచి విముక్తి కల్పించాం. నరేంద్ర మోదీ సిలిండర్ ధర రూ.1,200 చేస్తే.. మేము రూ.500కే ఇచ్చినం. ఈ ప్రభుత్వం ఆడబిడ్డల ప్రభుత్వం. ఆడబిడ్డలను ఆదుకునేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా వందలాది కోట్ల రూపాయలు అందించామన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చడం, మాదిగల వర్గీకరణ బాధ్యత కాంగ్రెస్‌దే. ఆగస్ట్ 15లోపు ముదిరాజ్ బిడ్డను మంత్రిగా చేసే బాధ్యత నాదే.

ఏదైనా ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారా..

కరీంనగర్ ప్రజలు తిరస్కరించి బండకేసి కొడుతమని తరిమితే కేసీఆర్ అక్కడి నుంచి పారిపోయి పాలమూరుకు వలస వచ్చిండు. తెలంగాణ కోసం పార్టీలకతీతంగా ఆనాడు విఠల్ రావును కాదని.. కేసీఆర్‌ను పార్లమెంట్‌కు పంపించాం. కష్టకాలంలో ఉన్న నిన్ను పాలమూరు జిల్లాలో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా ఎంపీగా గెలిపించి పంపిస్తే తెలంగాణ వచ్చింది. ఆ తర్వాత తెలంగాణలో పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ పాలమూరుకు తెచ్చింది ఏంది.. ఇచ్చింది ఏంది? సమైక్య పాలనలో ఆంధ్ర వాళ్ల 60 ఏళ్ల చెరబట్టి పడావుపెట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు ఏదైనా ప్రాజెక్ట్‌ను పూర్తి చేసినవా? ఏమైనా పరిశ్రమలు తెచ్చావా? మా తండాలు, దళితవాడలు, బలహీన వర్గాల బిడ్డలు చదువుకోవాలని.. డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు కావాలని.., ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లై రాజ్యమేలాలని కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పాలమూరు యూనివర్సిటీ మంజూరు చేసినం. చదువు చెప్పే పంతుళ్ల పదవులు 150 ఉంటే పదేళ్లుగా 130 ఖాళీలు పెట్టిండు. పంతుళ్లు లేకపోతే పిల్లలు చదువుకునేదెట్లని కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.

2 స్థానాల్లోనూ గెలిపించాలె..

ఇన్నేండ్లు ఎవరెవరికో ఓట్లేసింద్రు. ఎవరెవరో రాజ్యమేలింద్రు.. ఎవరి దగ్గరకు పోయినా అయ్యా దేహీ అని అడుక్కునే పరిస్థితి ఈ పాలమూరుకు తెచ్చింద్రు. ఇయ్యాల మీరొక్కసారి ఆలోచన చేయాలి. ప్రభుత్వం మనది.. ఇంకా నాలుగున్నరేళ్లు మన ముంటం. మీ తరఫున ఢిల్లీలో మీరు చెప్పిన పనులు చక్కదిద్దడానికి మనవాడే కావాలి కదా. పేదలకు పెన్షన్లు ఇవ్వాలన్నా, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నా, సదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్నా, ఈ ప్రాంతంలో పెట్టుబడులు తేవాలన్నా ఈ రెండు పార్లమెంట్ స్థానాలతోపాటు తెలంగాణలో 14 ఎంపీలు గెలిపించినప్పుడే ప్రయోజనముంటది.

దొంగదెబ్బ తీయాలని చూస్తున్నారు

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి మంచోడే.. నాక్కూడా తెల్సినోడే. గతంలో కాంగ్రెస్ ఆయనను ఎంపీటీసీని చేసింది. కేసీఆర్ ఎంపీని చేసిండు. ఆయన అదృష్టం బానే ఉంది. కానీ ఐదేళ్లలో ఏనాడైనా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడిండా.. పాలమూరు ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించిండా? మళ్లొక్కసారి శ్రీనివాస్‌రెడ్డిని కేసీఆర్ మా అభ్యర్థి అని పంపించిండు. ఏం చూసి ఓటెయ్యాలి. మనల్ని దొంగదెబ్బ తీయాలని బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లు ఎనుకంగ కుట్రలు చేస్తున్నారు.. అప్రమత్తంగా ఉండండి.. మనమెట్లాగు గెలుస్తాం. జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మాసారే ముఖ్యమంత్రి ఉన్నడు. మా అన్న ఏదంటే అది చేస్తాడని ఊకున్నారనుకో తాబేలు, కుందేలు కథ అవుతది. కార్యకర్తలకు నా విజ్ఞప్తి ఒక్కటే. మనం ఉరకాల్సిన పనిలేదు.. నడిస్తే చాలు.

న్యూస్‌రీల్

పాలీసెట్ దరఖాస్తుల ఆహ్వానం

పెబ్బేరు రూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకుగాను నిర్వహించే పాలీసెట్–2024 దరఖాస్తు గడువు 22వ తేదీతో ముగుస్తుందని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏకే శ్రీకాంత్ తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులు http://polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రామన్‌పాడులో 1,010 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోంది. శుక్రవారం 1,011 అడుగులకు చేరినట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల నుంచి నీటి సరఫరా లేదని, తాగునీటి అవసరాలకు రిజర్వాయర్‌లోని 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

పుర ఖజానా ఖాళీ గత పాలకుల పుణ్యమే..



వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలో రహదారి విస్తరణ పేరుతో గత పాలకులు మున్సిపాలిటీలోని నిధులన్నింటినీ ఖాళీ చేశారని మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్ తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి శుక్రవారం పుర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారి విస్తరణకు నిధులొచ్చాయని ప్రజలను నమ్మించి పుర నిధులతోనే పనులు చేయించారని.. దీంతో అభివృద్ధి అగమ్యగోచరంగా మారిందని ఆరోపించారు. ప్రస్తుతం ఏదైనా అత్యవసర పని చేయాలనుకున్నా కనీస నిధులు కూడా అందుబాటులో లేని దుస్థితికి నెట్టేశారన్నారు. అప్పట్లో ఏది అడిగినా మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాలంటూ నోర్లు మూయించారని మండిపడ్డారు. కౌన్సిలర్లు, అధికారుల మధ్య సమన్వయానికి పాతరేసి మున్సిపాలిటీని భ్రష్టు పట్టించారని దుయ్యబట్టారు. 8 నెలల కాలంలో పురపాలికను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగియగానే ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో వెనుదిరిగిన నిధులు తీసుకురావడంతో పాటు ప్రతిపక్ష పార్టీ తల దించుకునేలా అభివృద్ధి చేసి చూపిస్తారని తెలిపారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చెత్త పన్నును ప్రతినెల వసూలు చేస్తామని, గత పాలకవర్గంలో విధించిన రుసుంను కొంత తగ్గించేందుకు కౌన్సిలర్లతో చర్చిస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ బి.వెంకటేష్, నాయకులు యాదగిరి, బాషానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసి లక్ష్యాన్ని సాధిద్దాం



స్టేషన్ మహబూబ్‌నగర్: కష్టపడి పనిచేసి అనుకున్న లక్ష్యాన్ని సాధిద్దామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు 'లక్షే లక్ష్యం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రతి రోజు అదనంగా రూ.లక్ష ఆదాయాన్ని ప్రతి ఒక్క డిపో నుంచి తీసుకొని రావాలని కోరారు. ప్రతి డ్రైవర్, కండక్టర్ ప్రతి స్టేజీలో ఆపి అదనంగా ఐదుగురు లేదా ఆరుగురు ప్యాసింజర్లను ఎక్కించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. మనమందరం కలిసికట్టుగా పనిచేస్తే సాధ్యం కానిది ఏది లేదన్నారు. ఈ ఛాలెంజ్ కార్యక్రమం వచ్చే ఏడాది ఉగాది వరకు ఉంటుందని తెలిపారు. డిపో మేనేజర్ సుజాత, ఉద్యోగులు పాల్గొన్నారు.

పకడ్బందీగా హోం ఓటింగ్ ప్రక్రియ

- అదనపు కలెక్టర్ ఎం.నగేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎం.నగేష్

వనపర్తి: వృద్ధులు, దివ్యాంగులకు కల్పించిన హోం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.నగేష్ సూచించారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగుల కోసం హోం ఓటింగ్ సౌకర్యం కల్పించిందని.. మే 3, 4 తేదీల్లో ఈ ప్రక్రియ చేపట్టాలని, ఇందుకుగాను మండలాల వారీగా రూట్ చార్ట్‌లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. హోం ఓటింగ్ నిర్వహించే సిబ్బంది అధికారిక హోం ఓటర్ల జాబితాను, ఎన్నికల సామగ్రిని సరిచూసుకోవాలన్నారు. విధులు నిర్వర్తించే సిబ్బంది ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటించాలని.. ఓటింగ్ ప్రక్రియ నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. ఓటింగ్ ప్రక్రియ నిర్వహించడానికి ముందే రాజకీయ పార్టీలు, సంబంధిత ఓటర్లు, తహసీల్దార్లకు బీఎల్వోల ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. ఓటరు ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం పోలీసు గస్తీతో డ్రాప్‌బాక్సును సురక్షితంగా గమ్యస్థానానికి చేరవేయాలని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్డీఓ నాగేంద్ర పాల్గొన్నారు.

పంట దిగుబడి అంచనా



కొత్తకోట రూరల్: మండలంలోని రాయినిపేట శివారులో గ్రామానికి చెందిన రైతు దాసరి బండలయ్య వరి పొలంలో ఎన్ఎస్ఓ రాఘవేంద్ర, ఏఈఓ రవీంధర్‌రెడ్డి పంట దిగుబడి అంచనా వేశారు. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక ఎకరాకు ఎంత దిగుబడి వస్తుంది.. పెట్టుబడి, ఎంత మంది కూలీలు అవసరమనే కోణంలో అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం కో–ఆర్డినేటర్ జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదిక పాఠశాలల మరమ్మతు



ముగ్గులను తిలకిస్తున్న కలెక్టర్ తేజస్ పవార్

- కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తి: వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలోపు పాఠశాలల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ పవార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అవసరమైన మరమ్మతులు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, బోర్డులు సమకూర్చాలన్నారు. ఇప్పటికే చాలా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు ప్రక్రియ ముగిసిందని.. వీటి ద్వారా పనులు గుర్తించి తీర్మానాలు చేసుకొని పరిశీలన పూర్తయిన వాటికి పరిపాలన అనుమతులు ఇచ్చామన్నారు. కమిటీల పేరున జాయింట్ బ్యాంకు ఖాతాలు తెరిచామని, కొన్ని పాఠశాలల్లో ఈ ప్రక్రియ పెండింగ్‌లో ఉందని తెలిపారు. తీర్మానాలు చేయని పాఠశాలలపై అధికారులు దృష్టి సారించాలని, మండల విద్యాధికారులు, మండల ప్రత్యేక అధికారులు, స్కూల్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి త్వరగా గ్రౌండింగ్ పూర్తి చేయాలని.. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేగంగా పనులు పూర్తి చేయటంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధంలాంటిది..

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధంలాంటిదని కలెక్టర్ తేజస్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన స్వీప్ యాక్టివిటీ(ఓటరు అవగాహన) కార్యక్రమానికి ఆయన హాజరై ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు వేసిన ముగ్గులను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు తమను పాలించే నాయకుడిని ఎంచుకోవడం ఓటుహక్కుతోనే సాధ్యమవుతుందన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముగ్గులు వేసిన మహిళా సంఘాల సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.నగేష్, స్వీప్ నోడల్ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి, డీడబ్ల్యూఓ లక్ష్మీబాయి, అదనపు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి నాగేంద్ర



ఉపాధి పనులు పరిశీలిస్తున్న అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి నాగేంద్ర

పెబ్బేరు రూరల్: గ్రామాల్లో ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించి కూలీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చూడాలని అదనపు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి నాగేంద్ర క్షేత్ర సహాయకులకు సూచించారు. శుక్రవారం శ్రీరంగాపురం మండలం శేరుపల్లి, జానంపేటలో కొనసాగుతున్న చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొలతల ప్రకారం రోజు కూలీ రూ.300 వచ్చేలా పనులు చేయాలని, రెండు గ్రామాల్లో కూలీలకు రూ.500 వరకు కూలి డబ్బులు వచ్చినట్లు వివరించారు. రోజు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు పనులు చేయాలని.. పని ప్రదేశంలో కూలీలకు షేడ్‌నెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. హరిత మొక్కలకు రోజు రెండు పూటలా నీరందించి సంరక్షించాలన్నారు. ఆయనవెంట ఎంపీడీఓ రవీంద్ర, ఏపీఓ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టీఏలు సురేందర్‌రెడ్డి, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో పనిచేద్దాం

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



గోప్లాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో పనిచేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధిద్దామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని గోప్లాపూర్, బహదూర్‌గూడెం, బండపల్లి, జమ్మాపూర్‌లో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకొని కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్థిక క్రమశిక్షణతో ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామని, ఇచ్చిన హామీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. చిన్నారులను ప్రభుత్వ బడుల్లోనే చదివించి బలోపేతానికి తోడ్పాటునందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపడతామని.. అర్హులందరికీ తప్పక న్యాయం చేస్తామని తెలిపారు. రూ.2 లక్షల పంట రుణమాఫీ, పంటల బీమా త్వరలో అమలు చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకునేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ ఎంపీ అభ్యర్థి డా. మల్లు రవి గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేష్‌నాయుడు, రవికుమార్, గోవర్ధన్‌సాగర్, పుల్లారావు, మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మయ్య, దశరథం, దర్గయ్య, ఉస్మాన్ పాష తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట: ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో మునకకు గురైన బండరావిపాకుల, కొంకలపల్లి గ్రామస్తులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రేవల్లి మండలం బండరావిపాకులలో కొత్తగా నిర్మించుకున్న ఆరు ఇళ్ల గృహ ప్రవేశాలకు హాజరై మాట్లాడారు. నిర్వాసితులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని.. అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు యాదవ్, సుల్తాన్, సురేష్‌గౌడ్, రాజు, బాల్‌రెడ్డి, తిరుపతయ్య, సురేందర్, లింగస్వామి పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం..

రేవల్లి మండలం చెన్నారం గ్రామంలో శనివారం గోపాల్‌పేట, రేవల్లి మండలాల కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరవుతారని.. అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

రెండోరోజు 6 నామినేషన్లు

- పాలమూరులో 5, నాగర్‌కర్నూల్‌లో ఒకటి దాఖలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ నాగర్‌కర్నూల్/సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రెండోరోజు శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు గాను 6 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి గాను స్వతంత్ర అభ్యర్థిగా హరిచందర్‌రెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి తరఫున ప్రతిపాదకులు టి.శ్రీధర్‌రెడ్డి ఒక సెట్ దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా సరోజనమ్మ ఒక సెట్, కాంగ్రెస్ పార్టీ తరఫున చల్లా వంశీచంద్‌రెడ్డి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా ఉమాశంకర్ ఒక సెట్ నామినేషన్ వేశారని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ తెలిపారు. అలాగే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ తరఫున ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ చెప్పారు. కాగా నాగర్‌కర్నూల్‌లో రెండు రోజులు కలుపుకొని ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారన ఆయన పేర్కొన్నారు.

బల ప్రదర్శన చూపించనున్న అభ్యర్థులు..

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం ఊపందుకుంది. గురువారం మొదటి రోజు బీజేపీ నుంచి పోతుగంటి భరత్ ప్రసాద్, కాంగ్రెస్ తరఫున మల్లు రవి నామినేషన్లు దాఖలు చేయగా.. రెండోరోజు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్ వేశారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఈ నెల 23న మరో నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ, జిల్లాకేంద్రంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ నెల 24న బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మరో నామినేషన్ వేయనుండగా.. భారీ రోడ్‌షోలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొననున్నారు. బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ 25 తేదీన మరోసెట్ నామినేషన్ పత్రాలు సమర్పించనుండగా.. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ రానున్నారు. ప్రధాన పార్టీలు ముఖ్యనేతలను రంగంలోకి దింపి నామినేషన్ల పర్వం నుంచే ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించనున్నాయి.

24న మందా జగన్నాథం..

ఇటీవల బీఎస్పీలో చేరిన మాజీ ఎంపీ మందా జగన్నాథం ఈ నెల 24న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేయనున్నారని తెలుస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ తోపాటు బీఎస్పీ అభ్యర్థి మందా జగన్నాథం సైతం నియోజకవర్గ వ్యాప్తంగా అధిక ప్రాబల్యం ఉన్న మాదిగ సామాజిక వర్గం ఓటర్లపై ప్రధానంగా ఆశలు పెట్టుకున్నారు. వీరందరి పోటీ నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు ఎలా ఉండబోతున్నాయన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

పేదలకు అండగా కేంద్ర పథకాలు : బీజేపీ



చిమనగుంటపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా శుక్రవారం వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజుతో కలిసి ఇల్లిల్లూ తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కమలం గుర్తుకు ఓటేసి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.

పెబ్బేరు మండలం గుమ్మడం తండాలో బీజేపీ వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ ఉపాధి పని ప్రదేశంలో కూలీలకు కేంద్ర పథకాలను వివరించారు. కమలం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీమోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి రామన్‌గౌడ్, మండల అధ్యక్షుడు నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: గుర్తు తెలియని మహిళ చీరతో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాత ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఆవరణలోని చెట్టుకు గుర్తుతెలియని మహిళ(45) చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

నర్వ: భూపంచాయితీ విషయంలో మాట్లాడుదామని పిలిపించి, హత్యకు పాల్పడిన నిందితుడికి యావజ్జీవ శిక్ష పడింది. పెద్దకడ్మూర్ చెందిన మొండి శ్రీను, భార్య మొండి కాశమ్మ హైదరాబాద్‌లోని మహత్మాగాంధీనగర్ షేక్‌పేటలో ఆటోనడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా ఇదే గ్రామంలో మొండి బాలరాజు, మొండి శ్రీనుకు పక్క పక్కనే పొలాలు ఉన్నాయి. ఇదే క్రమంలో ఇద్దరి మధ్య భూమి కొలవగా మృతునికి భూమి ఎక్కువగా వచ్చిందని, 2022 జూన్ 11న మొండి బాలరాజు, మొండి శ్రీనుకు ఫోన్‌చేసి భూమి విషయం మాట్లాడుదామని ఊరికి రమ్మని పిలిచాడు. గ్రామానికి వెళ్లగా పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడగా, జూన్ 14 రాత్రి మొండి శ్రీను తన చెల్లెలు అనిత ఇంటి వద్ద మంచంపై కూర్చొని అన్నం తింటుండగా మొండి బాలరాజు రోకలి బండతో వెనుక నుంచి వచ్చి తలపైన రెండు సార్లు కొట్టగా మొండి శ్రీను చనిపోయాడు. చెల్లెలు అనిత, భార్య కాశమ్మకు విషయం తెలుపగా, ఆమె నర్వ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ విక్రమ్ కేసు నమోదు చేయగా, మరికల్ సీఐ రామ్‌లాల్ కేసును పరిశోధించారు. నేరస్తుడికి వ్యతిరేకంగా 18 మంది సాక్షులను విచారించి చార్జిషీటు కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం ఎస్‌ఐ కురుమయ్య, కోర్టు ఆఫీసర్ వేణుగోపాల్, పీసీ విజయ్‌కుమార్ సహకారంతో కోర్టులో హాజరుపర్చగా మొండి బాలరాజుపై నేరం రుజువైందన్నారు. దీంతో జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 20వేల జరిమాన విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

గద్వాల క్రైం: ఎదురుగా వస్తున్న బైక్‌ను డీసీఎం ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అనంతపురం శివారులోని దయ్యాల వాగు వద్ద చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ పర్వతాలు తెలిపిన కథనం మేరకు.. అయిజ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ఇజ్రాయేల్ (41) ఉదయం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రవల్లి వైపు వెళ్తున్నారు. ఎర్రవల్లి నుంచి గద్వాల వైపు పాల లోడ్‌తో డీసీఎం వస్తుంది. ఈ క్రమంలో దయ్యాలవాగు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఇజ్రాయేల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన భార్య పద్మ, కూతురును చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని, విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

ధరూరు: కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఉప్పేరులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పుష్పావతి(39) గురువారం తీవ్ర కడుపు నొప్పి వచ్చింది. కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పుష్పావతి తల్లి శంకరమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలియజేశారు.

పశుగ్రాసం దగ్ధం

మరికల్: ప్రమాదవాశాస్తు విద్యుదాఘాతంతో పశుగ్రాసం దగ్ధమైన ఘటన శుక్రవారం మాధవరంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బర్ల వెంకట్‌రెడ్డి తన పొలంలో పాడి గెద్దెలను పెంచుతున్నాడు. వాటి మేత కోసం 15 రోజుల నుంచి ఇతర గ్రామాల్లో కోత వేసిన వరి గడిని కొనుగోలు వేసి తన గేదెల్ షేడ్ సమీపంలో పెద్ద వాములుగా వేశాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులకు విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి నిప్పు రవ్వలు రావడంతో అవి పక్కనే ఉన్నా పశుగ్రాసంపై పడి మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న రైతులు బిందెలతో నీళ్లు పోసిన మంటలు అదుపులోకి రాకపోవడంతో వెంటనే నారాయణపేట ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఫైర్‌ఇంజన్ వచ్చే సరికి పశుగ్రాసం పూర్తిగా దగ్ధం అయ్యింది. పొక్లెయిన్‌తో నిప్పు అంటుకొని గడ్డిని వేరు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. రూ. 2 లక్షలు విలువ చేసే పశుగ్రాసం బూడిదైందని రైతు వాపోయాడు. ప్రభుత్వపరంగా బాధిత రైతును ఆదుకోవాలని గ్రామ రైతులు అధికారులను కోరారు.

కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

పాలమూరులో భారీ ర్యాలీ నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి



మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్ వద్ద కార్నర్ మీటింగ్‌కు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు
- మెట్టుగడ్డ నుంచి కార్యకర్తలతో కలిసి ఊరేగింపు
- క్లాక్‌టవర్‌లో కార్నర్ మీటింగ్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పాలమూరుకు రావడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం భారీ ర్యాలీ నిర్వహించారు. ఉదయమే జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డకు వేలాదిమంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేరుకోగా.. 12.30 గంటల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి మెట్టుగడ్డకు వచ్చారు. అక్కడి నుంచి ఓపెన్‌టాప్ జీపులో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, పర్ణికారెడ్డి తదితరులు ర్యాలీగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, న్యూటౌన్, అంబేద్కర్ చౌరస్తా, అశోక్‌టాకీస్ చౌరస్తా మీదుగా క్లాక్‌టవర్‌కు చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీ ముందుకు కదిలారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో సీఎం పాల్గొన్నారు. ముదిరాజులను బీసీ–డీ నుంచి ఏ గ్రూపులోకి మార్చడానికి నిర్ణయం తీసుకున్నందుకు ముదిరాజ్ నాయకులు సీఎంను భారీ చేప అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గొల్ల కురుమ యాదవ సంఘం నాయకులు సీఎంను గొంగడితో సత్కరించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు కల్పించారు.

రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుద్దాం

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుద్దామని ఏఐసీసీ కార్యదర్శి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్ అన్నారు. రేవంత్‌రెడ్డి తమ్ముడిగా కడిగిన ముత్యంలాంటి చల్లా వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపుదామని కోరారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనా రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు వినోద్ కుమార్, సంజీవ్ ముదిరాజ్, ఎన్‌పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లు సేవకుడిలా పనిచేస్తా : చల్లా వంశీచంద్‌రెడ్డి

క్లాక్‌టవర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అండగా మీ ముందుకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వస్తున్న నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే ఢిల్లీలో వారధిగా ఉండి ఐదేళ్లు సేవకుడిలా పనిచేస్తానని అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే మక్తల్– పేట– కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ మూడు నెలల్లోనే రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లా బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు పౌరుషాన్ని ప్రపంచానికి చాటారని కొనియాడారు. రానున్న రోజుల్లో జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు రానుందని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే యెన్నం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుందన్నారు. దేశం, ధర్మం కోసం అంటూ ముందుకొస్తున్నారని, సారా కాంట్రాక్ట్ చేసేవారు, కల్లు అమ్మే వాళ్ల వైపు ధర్మం ఉంటుందా లేక జిల్లాకు సాగునీరు అందించి, నిరుద్యోగులకు కొలువులు ఇచ్చే వాళ్ల వైపు ఉంటుందో పాలమూరు ప్రజలు ఆలోచించాలని కోరారు.



సీఎం పర్యటన హైలెట్స్

- ఉదయం 9 గంటల నుంచే మెట్టుగడ్డకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు.
- సీఎం రేవంత్‌రెడ్డి రాకకోసం మెట్టుగడ్డ నలువైపులా ప్రజలు ఎదురుచూశారు.
- ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి మెట్టుగడ్డ నుంచే నిరుద్యోగ మార్చ్ నిర్వహించగా.. మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమం ర్యాలీ ఇక్కడ నుంచే చేపట్టారు.
- మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి మెట్టుగడ్డ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ టాప్ వాహనానికి చేరుకున్నారు.
- సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డికి కార్యకర్తలు గజమాలతో ఘన స్వాగతం పలికారు.
- మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో క్లాక్‌టవర్ వద్దకు రేవంత్‌రెడ్డి చేరుకున్నారు.
- క్లాక్‌టవర్ వద్ద ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో సమీపంలోని మసీద్ నుంచి అజాన్ రావడంతో కొద్దిసేపు ఆగారు.

కారు, అప్పులు లేని భరత్‌ప్రసాద్


నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు కారు లేదని, అప్పులు లేవని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఎల్‌ఎల్‌బీ, ఎంబీఏ, బీటెక్ చేసినట్లు వెల్లడించారు. తన పేరుపై కల్వకుర్తి మండలం గుండూరులో రూ.15.86లక్షలు విలువ చేసే వ్యవసాయ భూమి ఉందన్నారు. 2022–23లో రూ.4.91 లక్షలు ఆస్తి పను చెల్లించనట్లు, చేతిలో రూ.2 లక్షల నగదు, ఒక బైకు ఉన్నట్లు తెలిపారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, వివాహం కాలేదని అఫిడవిట్‌లో ప్రస్తావించారు.

– సాక్షి, నాగర్‌కర్నూల్



పాలన అస్తవ్యస్తం!

అలంపూర్ ఆలయాల్లో ఉద్యోగుల ఇష్టారాజ్యం



అలంపూర్ ఆలయాల సముదాయం

- పేరు ఒకరిది.. విధులు నిర్వర్తించేది మరొకరు
- వీఐపీల సేవకు పోటీ పడుతున్న వైనం

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకై క శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడి పాలన గాడి తప్పుతోంది. వేతనం తీసుకునేది ఒకరు.. ఉద్యోగం చేసేది మరొకరు అన్నట్టుగా మారింది వ్యవహారం. ఆలయ ఈవోకు మరికొన్ని ఆలయాల అదనపు బాధ్యతలు అప్పగించడంతో స్థానికంగా ఉండకపోవడంతో గుమాస్తాలే అధికారులుగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది కూడా సక్రమంగా తమ విధులు నిర్వర్తించడం లేదు. ఈవో ఉన్నప్పుడు విధుల్లో ఉంటూ వెళ్లిపోగానే తమ సొంత పనులకు పరిమితమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో టికెట్ కౌంటర్ సమయానికి తెరవక అర్చకులు, సిబ్బంది డబ్బులు చేతికి తీసుకొని పని కానిచ్చేస్తున్నారు. దీంతో కౌంటర్ ఆదాయం తగ్గిపోతుంది. టికెట్ కౌంటర్ ఉద్యోగులు మధ్యాహ్నం ఒంటిగంటకు వచ్చి మూడు గంటలకే వెళ్లిపోతున్నారు. సంబంధం లేని వారు కౌంటర్‌లో కూర్చుంటున్నారు. స్వీపర్లు, అటెండర్లు కూడా అనారోగ్య కారణాలు చూపుతూ బంధువులను విధులకు పంపిస్తున్నారు.

కాలక్షేపానికి సమయం కేటాయిస్తూ..

సిబ్బంది సమయానికి విధులకు రావడం లేదు. ఆలస్యంగా వచ్చినా కాసేపు సీట్లో కూర్చొని తమ వారిని పిలిపించుకొని కాలక్షేపం చేస్తున్నారు. వారి వెంట వచ్చిన చిన్నారులు ఏకంగా అధికారుల కుర్చీలో కూర్చుంటున్నారు. ప్రసాదం కౌంటర్ సిబ్బంది కూడా తరచూ మూసేస్తూ బంధుమిత్రుల పేరిట తీసుకున్న టెండర్ దుకాణాల్లో కూర్చోడానికే సమయం కేటాయిస్తున్నారు.

వీఐపీల సేవలకు పోటాపోటీ..!

ఆలయానికి తరచూ వచ్చే వీఐపీలకు దర్శనాలు చేయించేందుకు అటెండర్లు పోటీ పడుతుంటారు. ఎలాంటి టికెట్లు లేకుండా దర్బార్ దర్శనాలు చేయిస్తూ వారిచ్చే డబ్బులకు ఎగబడుతుంటారు. టూరిజం గైడ్ సైతం ఆలయంలోనే పాగావేసి ఉద్యోగిగా చలామణి అవుతున్నారు.

ఆలయంలోకి యాచకులు..

ఒకప్పుడు ఆలయ ప్రహరీ బయట ఉండే యాచకులు ఇప్పుడు నేరుగా ఆలయ ప్రాంగణంలో అడుగడుగున ఉంటూ భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీరిని తప్పించుకొని గర్భాలయం చేరుకోవడం భక్తులకు తలనొప్పిగా మారింది. ఇంత జరుగుతున్నా.. పాలనా యంత్రాంగం ఇవేమీ పట్టించుకోవడం లేదు.

నిబంధనలు అతిక్రమిస్తూ..

అధికారుల ఆదేశం లేనిదే సిబ్బంది ఎవరినీ నేరుగా ఆలయంలోకి తీసుకెళ్లొద్దనే నిబంధనలను ఇక్కడ తుంగలో తొక్కేశారు. డబ్బులున్న భక్తులు కొందరు ఆలయానికి తరచూ వస్తుంటారు. సిబ్బంది బలహీనతను ఆసరా చేసుకొని టికెట్లు లేకుండా వారికే నాలుగు డబ్బులు చేతిలో పెట్టేసి తమ వెంట తిప్పుకుంటూ హవా కొనసాగిస్తున్నారు. సామాన్య భక్తులు ఇక్కడ డబ్బున్న వారికే ప్రాధాన్యం ఇస్తారంటూ పెదవి విరిస్తూ తమ బాధను దిగమింగుకుంటున్నారు.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం..



నేను లేని సమయంలో నా సీటుపై ఇతరులు కూర్చోవడం.. ఆలయ సిబ్బంది చూస్తూ కూడా మౌనం వహించడం చాలా తప్పు. అలాగే అధికారుల ఆదేశాలు లేనిదే సిబ్బంది ఎవరు కూడా టికెట్లు లేకుండా భక్తులను నేరుగా దర్శనాలకు తీసుకెళ్లడం వంటి అంశాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– పురేందర్‌కుమార్, ఈఓ, అలంపూర్ ఆలయాలు

మూగ యువతిపై అసభ్యకర ప్రవర్తన

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నాగర్‌కర్నూల్: బిజినేపల్లి మండల కేంద్రంలో మూగ యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు మాసయ్యను సస్పెన్షన్ చేసినట్లు డీఈఓ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మాసయ్య సాంఘిక శాస్త్రం బోధిస్తున్నాడు. డీఈఓ గురువారం పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుడికి సంబంధించిన వివరాలు, సంఘటన వివరాలను తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించిన సమయంలో మాసయ్యను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి ప్రాథమిక దర్యాప్తు చేపట్టి గురువారం కేసు నమోదు చేశారు. ఈ మేరకు డీఈఓ కూడా తమ శాఖ తరఫున విచారణ చేపట్టి, నివేదికను కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు సమర్పించారు. దీంతో ఉపాధ్యాయుడిని సస్పెన్షన్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు.

వేర్వేరు చోట్ల 50 లీటర్ల మద్యం పట్టివేత

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో మద్యం పట్టుబడినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఏఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అలంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టులో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఉండవెల్లి మండలం మెన్నిపాడుకి చెందిన ప్రతాప్ గౌడ్ వద్ద 14.76 లీటర్ల మద్యం లభించినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.12,710 ఉంటుందని అంచనా వేశారు. మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఉండవెల్లిలో 35 లీటర్లు..

ఉండవెల్లి: మండలంలోని మెన్నిపాడులో ప్రతాప్ గౌడ్ ఇంట్లో 14.76 లీటర్ల మద్యం నిల్వ చేయగా.. పోలిసులు పట్టుకున్నారు. డి.బూడిదపాడు శివారులో క్యాతూరుకు అక్రమంగా 20.28 లీటర్ల మద్యాన్ని గుత్తి నర్సన్ గౌడ్ తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. మొత్తం 35.04 లీటర్ల మద్యాన్ని పట్టుకుని ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. మొత్తం వీటి విలువ రూ.27,650 ఉంటుందని అంచనా వేశారు.

గోపాల్‌పేట: జిల్లా సరిహద్దు బుద్దారం గండి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం నగదు పట్టుకుని సీజ్ చేశామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. బిజినేపల్లి మండలం గుడ్లనర్వకు చెందిన మేకల శ్రీశైలం గుడ్లనర్వ నుంచి బుద్దారంకు రూ.1.50లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశామని పేర్కొన్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని బొక్కలోనిపల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పశువుల కొట్టంలో కట్టేసిన లేగదూడపై గురువారం రాత్రి చిరుత దాడిచేసింది. సుమారు 15 రోజుల కిందట చిరుత పాదముద్రలను ఆ ప్రాంతంలో గుర్తించిన అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పశువులను వ్యవసాయ పొలాల వద్ద కట్టేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు. రైతులు కొందరు అలానే పశుములను పొలాల వద్ద కట్టేయడంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు తెలిసింది. కాగా శుక్రవారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాఘవేందర్‌రెడ్డి, సెక్షన్ జి.శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని సందర్శించి లేగదూడ మృతదేహాన్ని పరిశీలించి పరీక్షల నిమిత్తం వెటర్నరీ అధికారులకు అప్పగించారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు పోటీ చేసే అర్హత లేదు



మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014లో మోదీ పాలమూరు– రంగారెడ్డి పనులు చేపడతామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఏ రంగంలో మోదీ ప్రభుత్వం అభివృద్ధి సాధించి పేదలకు మేలు చేసిందో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసానికి, దగాకు మారుపేరని, నవంబర్‌లో ఎన్నికలు జరిగితే డిసెంబర్‌లో హామీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ప్రభుత్వం నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులు పెడుతోందని దుయ్యబట్టారు. 26 ఏళ్ల ఆలిండియా సర్వీస్‌లో పనిచేసి నిజాయితీ గల ఆర్‌ఎస్ ప్రవీణ్‌ను బీఆర్‌ఎస్ తరఫున పోటీలో నిలబెట్టామని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలు నాగర్‌కర్నూల్ ప్రాంతానికి ఒక దిక్సూచి కాబోతున్నాయని పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కందనూలు గడ్డకు సేవచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రచారంలో భాగంగా ప్రజల కష్టాలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో ముందుంటా..

- కొల్లాపూర్‌లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రోడ్‌షో



కొల్లాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కొల్లాపూర్: నన్ను ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తా. ప్రజలకు అందుబాటులో ఉంటానని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి కొల్లాపూర్ రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపార దుకాణదారులను కలిశారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పోలీస్ అధికారిగా, గురుకులాల కార్యదర్శిగా, రాజకీయ నాయకుడిగా ఎప్పుడూ నేను సామాన్యులకు అందుబాటులో ఉన్నానన్నారు. గతంలో ఎంపీలుగా గెలిచిన వారు ఎప్పుడూ కొల్లాపూర్ నియోజకవర్గ సమస్యలు పార్లమెంట్‌లో మాట్లాడలేదన్నారు. కొల్లాపూర్‌కు నేషనల్ హైవే, కృష్ణానదిపై బ్రిడ్జి ఎవరు మంజూరు చేయించారో ప్రజలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి, బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ తండ్రి రాములు పరిపాలన మీరు చూశారు. నాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండని ప్రజలను కోరారు. ఆయన వెంట నాయకులు రంగినేని అభిలాష్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి, రాంచందర్ యాదవ్, పోతుల వెంకటేశ్వర్లు, విజయరామారావు తదితరులు ఉన్నారు.

కురుమూర్తిస్వామి ఆశీస్సులతో గెలుస్తా



మాట్లాడుతున్న డీకే అరుణ

చిన్నచింతకుంట: పార్లమెంట్ ఎన్నికల్లో కురుమూర్తిస్వామి ఆశీస్సులతో ఎంపీగా విజయం సాధిస్తానని బీజేపీ మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామిని ఆమె దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. అందుకోసం ప్రజలు మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. కురుమూర్తి స్వామి ఆశీస్సులతో నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని కావడం, పాలమూరులో తాను ఎంపీ కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర ఇన్‌చార్జ్ ప్రశాంత్‌రెడ్డి, నాయకులు కుర్వ రమేష్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ మహిళల జీవితాల్లో వెలుగులు

పాలమూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కార్ ట్రిపుల్ తలాఖ్ రద్దు చేయడంతో మైనార్టీ మహిళల జీవితాల్లో వెలుగులు వచ్చాయని, బీజేపీ మైనార్టీలకు వ్యతిరేక పార్టీ కాదని డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆల్మాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మైనార్టీ మహిళల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మైనార్టీ మహిళలు మోదీని ఆశీర్వదించాలని కోరారు. ఇవి దేశంలో ప్రధాని ఎవరో నిర్ణయించే ఓట్లు అని, గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. బీజేపీకి, మోదీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసి బీజేపీ మైనార్టీ వ్యతిరేక పార్టీ అని ముద్ర వేశారన్నారు. కానీ, దేశంలో మైనార్టీల సంక్షేమం కోసం పాటుపాడుతుంది మోదీ అని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గర్భిణి మృతిపై ఫిర్యాదు

ధరూరు: చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లిన ఓ గర్భిణీ మృతి చెందింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఉప్పేరుకి చెందిన నాగలక్ష్మి గర్భిణి. శుక్రవారం ఆమె హైబీపీతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లింది. చికిత్స పొందుతూ.. మృతి చెందింది. ఈమె మృతిపై తల్లిదండ్రులు రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలియజేశారు.